ఉత్తరాంధ్రను పూర్తిగా విస్మరించారు

సీపీఐ జిల్లా మహాసభల సందర్భంగా వక్తలు ఉద్ఘాటన

విశాలాంధ్ర-పాలకొండ/వీరఘట్టం : పాలకులు ఉత్తరాంధ్ర అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య పేర్కొన్నారు సిపిఐ జిల్లా మహాసభలు పాలకొండ పట్టణంలో శుక్రవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి ఈ మహాసభలు ఈనెల 8 9 తేదీలలో నిర్వహిస్తున్నారు ఈ మహాసభల సందర్భంగా సిపిఐ పార్టీ అగ్ర నాయకులు హాజరు అయ్యి మాట్లాడేరు ముందుగా ఈశ్వరయ్య మాట్లాడుతూ ఉత్తరాంధ్ర నేటికీ వెనుకబడి వలసల ఆంధ్రగా తయారయ్యిందని ఏ సుదూర ప్రాంతానికి వెళ్లిన ఉత్తరాంధ్ర వాసులే కూలి పనులు చేసుకుంటూ కనిపిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు పూర్తిస్థాయిలో ఈ ప్రాంతంలో పరిశ్రమలు లేక యువత వలసలు పడుతున్నారని అన్నారు విద్య ఉపాధి అవకాశాలు లేక కడుపు చేత పట్టుకొని కుటుంబాలతో వలస జీవులుగా ఉత్తరాంధ్రవాసులు జీవన విధానం చాలా అధ్వానంగా ఉందని పాలకులు వీరి జీవితాలతో ఆటలాడుకుంటున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లా సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న పాలకులకు పట్టడం లేదని విమర్శించారు తోటపల్లి ఆధునీకరణ చేస్తానని చెబుతున్న నేటికీ కూడా పనులు పూర్తి చేయలేకపోయారని ఎద్దేవ చేశారు ఇదేనా రైతు సంక్షేమము అని ప్రశ్నించారు జంజావతి ప్రాజెక్టు అర్ధాంతరంగా నిలిచిపోయిందని అన్నారు రావాడ సీతానగరం పెద్ద అంకలాం పెద్ద గేడ్డ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు పాలకులు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు గిరిజనులకు ఎటువంటి అభివృద్ధి పలాలు లేవని అన్నారు తమ పంటను భద్రపరుచుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు లేక దళారులకు పంటను విక్రయిస్తూ గిరిజనులు నష్టపోతున్నారని అన్నారు.ఉత్తరాంధ్రలో చెరకు కర్మాగారాలు మూతపడడంతో కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడుతున్నారని విమర్శించారు చెరకు రైతులు తీవ్ర నష్టాలను చవి చూస్తున్నారని అన్నారు ఫ్యాక్టరీలు మూతపడడంతో చెరుకు సాగు గణనీయంగా తగ్గిపోతుందని అన్నారు.సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ కామేశ్వరరావు మాట్లాడుతూ ఈ మహాసభలలో చర్చించిన అంశాలు రాష్ట్ర మహాసభలలో ప్రస్తావించి పరిష్కారానికి పోరుబాటను నిర్వహిస్తామని చెప్పారు పాలకుల దృష్టికి ప్రజా సమస్యలను తీసుకువెళ్తామని సకాలంలో పరిష్కరించకపోతే సమరసిల పోరాటాలే తధ్యమని హెచ్చరించారు, పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు మాట్లాడుతూ గిరిజనులకు పోడు భూమి పట్టాలను తక్షణమే అందజేయాలని వీర ఘట్టం పరిధిలో నర్సిపురం గ్రామానికి చెందిన అనేక మంది గిరిజనులకు పట్టాలు ఇచ్చి భూమిని ఇంతవరకు అప్పజెప్పలేదని తక్షణమే అర్హులైన ప్రతి ఒక్కరికి ఆ భూములు అప్పచెప్పాలని డిమాండ్ చేశారు సీతంపేట ఐటిడిఏ ను అభివృద్ధి చేసి గిరిజనులకు మరింత ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు సిపిఐ పార్టీ ఆహ్వాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రజల కోసం నిస్వార్థంగా పోరాడుతున్నది సిపిఐ పార్టీ ఒక్కటే అని అన్నారు అన్ని వర్గాలకు అండగా సిపిఐ నిలుస్తుంది అన్నారు ప్రజల హక్కుల కోసం ధైర్యంగా సిపిఐ పోరాడుతుందని అన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తమ పార్టీ జాతీయ,రాష్ట్ర నాయకులు నిరంతరం పోరాడుతూ ప్రజల పక్షాన నిలుస్తున్నారని అన్నారు అలాగే ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో జరగనున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సూచించారు ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ప్రస్తావన చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు తోట జీవన్ ఐవి నాయుడు సూరయ్య గోపి నాయుడు ఆర్ వి ఎస్ కుమార్ నీలకంఠేశ్వర యాదవ్ ఉత్తరావిల్లి మురళీమోహన్రావు బుడితి భారతి ద్వారపూడి అప్పలనాయుడు బి రవి కుమార్ సుశీల మోహనరావు అనేకమంది సిపిఐ పార్టీ కార్యకర్తలు అన్ని వర్గాల ప్రజలు గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదివాసీల జీవనోపాధికి కలిసి కృషి చేద్దాం : కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలోని గిరిజన ప్రజలకు విద్య, వైద్యం, జీవనోపాధులను కల్పించేందుకు అందరం కలిసి కృషి చేద్దామని ఐటీడీఏ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పార్వతీపురం ఐటీడీఏలోని అడవితల్లి విగ్రహానికి ప్రథమ పూజలు గిరిజన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సంప్రదాయబద్ధంగా జరిగాయి. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ అడవితల్లికి పట్టు వస్త్రాలను, సారెను అందించగా, అధికారులు, గిరిజన సంఘాల నాయకులతో కలిసి పాలాభిషేకాన్ని నిర్వహించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం అడవితల్లి చుట్టూ ప్రదర్శనలు నిర్వహించి, సంప్రదాయబద్ధంగా డప్పులను పీఓతో కలిసి వాయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కల్మషం లేని అమాయక గిరిజనులు మధ్యలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. గిరిజనులకు నాణ్యమైన విద్య, వైద్యంతో పాటు వారికి జీవనోపాధులు కల్పించి, ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాల్సి ఉందని, ఇందుకు సమష్టి కృషి అవసరమని అన్నారు. గిరిజనుల సంక్షేమం కొరకు ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలుచేస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ, జిల్లా యంత్రాంగం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం విలు విద్య పోటీలను ప్రారంభించి, విలువిద్యను గిరిజన క్రీడాకారులు ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, ఏపీఓ ఎ.మురళీధర్, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి ఆర్.కృష్ణవేణి, డీఐఓ డాక్టర్ పి.జగన్మోహనరావు, పలు గిరిజన సంఘాల నాయకులు పాలక రంజిత్ కుమార్, పల్ల సురేష్, ఆరిక చంద్ర శేఖర్, ఇంటికొప్పల రామకృష్ణ, కోలక గౌరమ్మ, దుక్క సీతారాం,అప్పల రాజుదొర, వెంకటరమణ, గౌరీసు, లక్ష్మణ, చినలక్ష్మణరావు, సిమ్మడు, సన్యాసిరావు, అప్పన్న, బంగారయ్య, రమణ తదితర గిరిజన సంఘాల నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసి దినోత్సవ కార్యక్రమంలో డప్పులను కొట్టిన కలెక్టర్, ఐటీడీఏ పీవోలు

విశాలాంధ్ర-పార్వతీపురం : నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సందర్భంగా శుక్రవారం నాడు పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలోగల ప్రగతల్లి విగ్రహానికి పూలమాలలువేసి, పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వ హించారు. అడవి తల్లికి పట్టు వస్త్రాలను సమర్పించారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ అశుతోష్ శ్రీవాత్సవలు సాంప్రదాయ వస్త్రధారణలో కార్యక్రమంలో పాల్గొని డప్పులనుకొట్టి, గిరిజనులతో మమేకమై దాన్సులు చేశారు. ప్రకృతిని కాపాడే అడవితల్లులను ఆరాధించడం పూజించడం వలన అందరికీ మంచి జరుగుతుందని తెలిపారు. ఈ కార్య క్రమంలో ఐటిడిఏ అధికారులు సిబ్బందితో పాటు గిరిజన సంఘాలకు చెందిన నాయకులంతా పాల్గొన్నారు. శనివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్, ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ అశుతోష్ శ్రీవాత్సవలు తెలిపారు.

104 వాహన పైలట్లకు శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-బెలగాం : 104 వాహనాల జిల్లా మేనేజర్ కృష్ణ, జిల్లా ఫ్లీట్ మేనేజర్ పైడిరాజు శుక్రవారం 104 పైలట్లకు స్థానిక ఎపి ఎన్జీఓ హెూంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలను ప్రతిరోజూ పరిశీలించి ఏదైనా రిపేర్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వాహనాల వలన ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని గ్రామాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అన్ని వాహనాలలో మందులు అందుబాటులో ఉన్నాయని, మరికొన్ని రోజుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం అన్ని రకాల పరీక్షలు చేయడానికి ల్యాబ్ టెక్నీషియన్లు కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నారు కాబట్టి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ ఎగ్జిక్యూటీవీలు మురళి, రాజశేఖర్, 104 వాహన పైలెట్లు సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం సమస్యల పరిష్కరానికి చొరవ చూపండి

ముఖ్యమంత్రి చంద్రబాబును కోరిన ఎమ్మెల్యే జగదీశ్వరి

విశాలాంధ్ర-కురుపాం : కురుపాం నియోజకవర్గం సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపాలని రాష్ట్ర విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను కోరారు. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేరుగా ఎమ్మెల్యేలతో ఒకొక్కరిని కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా కురుపాం నియోజకవర్గంలోఐదు మండలాలలో రహదారులు కోసం నిధులు మంజూరు చేయమని, పీఎంజన్ మాన్ యోజన పథకం క్రింద పివిటిజి గ్రామాలకు బోర్స్ మంజూరు చేయమని, నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న నాడు - నేడు పనులకు నిధులు మంజూరు చేయాలని భద్రగిరి హాస్పిటల్‌లో 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలని, కుంకి ఏనుగులు కురుపాం నియోజకవర్గం త్వరగా పంపించాలని, అలాగే ఏనుగులు వలన నష్ట పోయిన రైతులకు, నష్టపరిహారానికి నిధులు ఇవ్వాలని, ఆశ్రమ పాఠశాలలోను, హాస్టల్‌లో ఏఎన్ఎంలు, అలాగే 24ఐ7, పిఎచ్‌సి, సిఎన్‌సిలలో స్టాఫ్ నర్స్‌లను నియమించాలని, పూర్ణపాడు -లాబేసు వంతెన, పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని, జీఓ నెంబర్ 3కి బదులు కొత్త జీఓ తెచ్చి గిరిజనులకు ఆదుకోవాలని కోరామన్నారు. ఇంజనీరింగ్ కాలేజ్ పనులు కోసం నిధులు మంజూరు చేయాలని, శ్రీనిధి కింద మహిళా మండలి సభ్యులకు స్వయం ఉపాధి ఋణాలుమంజూరు చేయాలని ముఖ్యమంత్రి కోరగాజరిగింది సానుకూలంగా స్పందించి త్వరలో అన్ని అమలుచేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

హాకి లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినం పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర-బెలగాం : ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రదేశ్ వారి ఆదేశానుసారం ఈనెల 29వ తేదీన హాకి లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినం పురస్కరించుకుని జాతీయ క్రీడాదినోత్సవం-2025లో బాగంగా అథ్లెటిక్స్ (100మీ, 400మీ, 4×400మీ రిలే, 800మీ, లాంగ్ జంప్, హై జంప్), ఆర్చెరీ, బ్యాడ్మింటన్ (సింగిల్స్/డబుల్స్ అండర్-19 సం.), బాక్సింగ్ (అన్ని కేటగిరీలు), బాస్కెట్ బాల్, హాకి, కబడ్డీ, ఖో ఖో, వైట్ లిఫ్టింగ్ (అన్ని కేటగిరీలు) క్రీడా అంశములలో 22 సంవత్సరాలలోపు పురుష, మహిళలకు జిల్లా స్థాయి, జోనల్ స్థాయి మరియు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించబడునని పార్వతీపురం మన్యం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. శ్రీధర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపాదిత షెడ్యూలు ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లా టీములు ఎంపికలు ఈనెల 12వ తేదీ ఉదయం 8:00 గంటల నుండి పార్వతీపురం శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాల మైదానం నందు నిర్వహించబడునని కావున జిల్లాలో ఆసక్తి గలిగిన అథ్లెటిక్స్ (పై తెలిపిన యివెంట్స్), ఆర్చెరీ, బ్యాడ్మింటన్ (సింగిల్స్/డబుల్స్ అండర్-19 సం.), బాక్సింగ్ (అన్ని కేటగిరీలు), బాస్కెట్ బాల్, హాకి, కబడ్డీ, ఖోఖో, వైట్ లిఫ్టింగ్ (అన్ని కేటగిరీలు) క్రీడాకారులు ఈనెల 12వ తేదీ ఉదయం 8:00 గంటల నుండి పార్వతీపురం శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాల మైదానం నందు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించి జోనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించగలరని కోరారు.

నేడు మన్యంలో సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టి పడేలా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

విశాలాంధ్ర-సీతంపేట : ఐటీడీఏలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించడం జరుగుతుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సి యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. సీతంపేట బస్టాండ్ నుండి ఐటిడిఏ ఆడవి తల్లి విగ్రహం వరకు ఆదివాసీలు దప్పు వాయిద్యంతో ఊరేగింపుగా వచ్చి చందమ్మ తల్లికి మొక్కుబడులు తీర్చి అడవితల్లి విగ్రహానికి పూలమాలలు వేయడం జరుగుతుందని తెలిపారు. ఐటీడీఏ లో ప్రపంచ ఆదివాసి దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ప్రధానమంత్రి వన్ ధన్ యోజన పథకంతో కుట్టుమిషన్లు పంపిణీ

విశాలాంధ్ర-జి.మాడుగుల : మండలం సొలబం పంచాయతీ ఎస్ పెదబయలు వివో పరిధిలోగల వనబరంగిపాడు లో స్థానిక మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సొలబం పంచాయతీ సర్పంచ్ ఐసరం హనుమంతరావు, మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయడం జరిగింది, ఈ సందర్భంగా సర్పంచ్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి వన్ దన్ యోజన కేంద్ర పథకంలో భాగంగా పాడేరు ఐటీడీఏ, వెలుగు వారి ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయడం ఆనందంగా ఉన్నదని, ఈ కుట్టు మిషన్లు పంపిణీ చేయడం ద్వారా మహిళలు మన్య ప్రాంతంలో లభించే అడ్డాకులను సేకరించి వాటిని మిషన్లపై కుట్టి విస్తరాకులుగా మలచి అధిక ఆదాయం సంపాదించుకోవచ్చని అన్నారు, కుట్టుమిషన్‌ల పంపిణీ వల్ల గిరిజన మహిళలలో ఆర్థిక పురోభివృద్ధి చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ఉప సర్పంచ్, వెలుగు సిసి, వివివోలు, పెసా కమిటీ ఉపాధ్యక్షులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పాడేరులో ముఖ్యమంత్రి పర్యటన

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం పాడేరులో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ తెలిపారు. శనివారం ఉదయం 10.00 గం.లకు పాడేరు మండలం లగిసపల్లిలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ కు చేరుకుంటారని అన్నారు. 10.25 గం. లకు వంజంగి గ్రామానికి బయలుదేరి వెళతారని, 10.25 గం.ల నుంచి 11.40 గం.ల వరకు దేవాలయ సందర్శన, ఆదివాసీ దినోత్సవంలో భాగస్వామ్యం, గృహాల సందర్శన, కాఫీ తోటల్లో రైతులతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. 11.45 గం.ల నుంచి మధ్యాహ్నం 01.05 గం.ల వరకు ప్రజావేదిక, పలు కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో పాటు పలు ఒప్పందాలపై సంతకాలు అనంతరం బహిరంగ సభ ఉంటుందని అన్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి మధ్యాహ్నం 2.20 గం.లకు లగిసపల్లిలోని హెలిప్యాడ్ కు చేరుకొని విజయవాడకు బయలుదేరి వెళతారని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

దిగుడుపుటులో మొక్కలు పంపిణీ

విశాలాంధ్ర-హుకుంపేట : మండలంలోని హుకుంపేట పంచాయితీ దిగుడుపుటు గ్రామం లో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సిల్వర్ ఓక్, మహా గని మొక్కలను శుక్రవారం పంపించే శారు. స్థానిక సర్పంచ్ సమీడా వెంకటా పూర్ణిమ చేతులు మీదగా లబ్ధిదారులకు మొక్కలను అందజే శారు ఈ సందర్భంగా ఆమె మాట్లా దుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సిల్వర్ ఓక్ 16 వందలు, మహా గని 16 వందలు మొక్కలను స్థానిక గ్రామంలో ఉన్న 72 కుటుంబాలకు గిరి రైతులకు అందజేయడం జరిగిందన్నారు. లబ్ధిదారులు ఇచ్చిన మొక్కలు తమ భూమిలో నాటుకొని సంరక్షించుకొనే విధంగా ప్రతి ఒక్కరు చూసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమం లో ఎన్ఆర్ ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ పి సుధీర్, విఆర్ వి రామయ్య, హుకుంపేట పంచాయతీ అధ్యక్షులు నాగేష్, తదిర్లు పాల్గొన్నారు.

సీఎం గారూ... ఆర్.వి.నగర్-పాలగడ్డ అంతర్రాష్ట్ర రోడ్డు పనులపై దృష్టి సారించండి

విశాలాంధ్ర-సీలేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం ఆర్. వి. నగర్ నుంచి పాలగడ్డ వరకు ఉన్న అంతర్రాష్ట్ర రోడ్డు పనులు వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని గౌరవనీయులు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి సీలేరు, దారకొండ, గుమ్మరేవుల, దుప్పులవాడ గ్రామ పంచాయతీల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకున్నారు ఈ విషయంపై స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముందుగా ఆదివాసి దినోత్సవ సందర్భంగా పాడేరు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ఎన్నో సంవత్సరాలుగా మూడు రాష్ట్రాలను కలిపే ఈ అంతర్ రాష్ట్ర రహదారి మరమ్మత్తులకు నోచుకోక పూర్తిగా పాడయిందని, దీనిని ఆర్. వి. నగర్ మీదుగా పాలగడ్డ రోడ్డు వరకు పనులు వెంటనే ప్రారంభించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అన్నారు. అదే విధంగా ఈ ప్రాంతంలో ఉన్న ఇతర ప్రధాన సమస్యలైన గంగవరం, అగ్రహారం, చోడ రాయి. బ్రిడ్జిలు కూడా పూర్తిస్థాయిలో నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని గత సంవత్సరం భారీ తుఫాను కారణంగా నష్టపోయిన ఆయా ప్రాంతాల రైతులను ఆదుకోవాలని అన్నారు ఈ సమస్యలపై చాలాసార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎవరూ పట్టించుకోక పోవడంతో ఈరోజు తమరిని వేడుకోవడం జరుగుతుందని కావున శ్రీముఖ్యమంత్రివర్యులు మా సమస్యలపై స్పందించి ఈ ప్రాంతానికి మేలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటారని కోరారు ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి కారే శ్రీనువాసు. దుప్పులవాడ పంచాయతీ మాజీ సర్పంచ్ అల్లంగి రాజు. గుమరేవుల మాజీ సర్పంచ్ పూజారి బాబురావు. దారకొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లు దొర. జీకే వీధి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోన్ను. సీలేరు టౌన్ అధ్యక్షులు వానపల్లి అప్పారావు. ఉపాధ్యక్షుడు మైలుపల్లి సత్తిబాబు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు సిహెచ్ బుజ్జి వార్డు మెంబర్లు రాంచందర్ సీసా మోసియా తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ టెండర్ నిర్వహించి యువతకు ఉపాధి కల్పించాలి

సీపీఐ మండల కార్యదర్శి సింహాచలం

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : ప్రపంచంలో పేరుగాంచిన ప్రముఖ పర్యాటక ప్రాంతమైన చాపరాయి జలవిహారిలో వాహనాల పార్కింగ్ టెండర్ నిర్వహించి స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని సిపిఐ మండల కార్యదర్శి కె. సింహాచలం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చాపరాయి జలవిహారిలో టెండర్ ద్వారా స్థానిక నిరుద్యోగ యువత అనేకమంది ఉపాధి పొందే వారిని చెప్పారు. ప్రస్తుతం ఐటిడిఏ తీసుకోవడంతో స్థానిక నిరుద్యోగ యువత అనేకమంది ఉపాధి అవకాశాలు లేక పలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. చాపరాయి జలవిహారిలో వాహనాల పార్కింగ్ టెండర్ నిర్వహిస్తే స్థానిక నిరుద్యోగ యువత ఉపాధి పొందుతారని చెప్పారు. ఈ విషయంపై అధికారులు స్పందించి చాపరాయి జల విహారిలో వాహనాల పార్కింగ్ టెండర్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఇన్చార్జి కమిషనర్‌గా శ్రీనివాసరాజు

విశాలాంధ్ర- పార్వతీపురం టౌన్ : స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా (ఇంచార్జ్) జి.శ్రీనివాస రాజును నియమిస్తూ మున్సిపల్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇదివరకు ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన సిహెచ్ వెంకటేశ్వర్లు పలు ఆరోపణలకు గురికావడంతో ఆయనను సిడిఎంఏ కార్యాలయానికి సరెండర్ చేస్తూ అధికారులు జీవో జారీ చేశారు. శుక్రవారం శ్రీనివాసరాజుకు బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరాజు ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు సిబ్బంది సహకారంతో అన్ని విధాల మున్సిపల్ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానన్నారు.

కదం తొక్కిన నిరుద్యోగ యువగళం... భారీ ప్రదర్శన

- పాడేరు పట్టణమంతా మహా ధర్నాతో కిక్కిరించిన రోడ్లు
- గంటల వ్యవధి రోడ్లపై నిలిచిన వాహనాలు
- యువగళం జీపుజాత విజయవంతం

విశాలాంధ్ర-పాడేరు : గిరిజన నిరుద్యోగ యువతి యువకులు ఆదివాసీ స్పెషల్ డిఎస్సి, గిరిజనులకు 100శాతం ఉద్యోగ ఉపాధి, ఉద్యోగ రిజర్వేషన్లు కల్పన చేయాలని, గిరిజనులకు ముఖ్యమంత్రి ప్రకటించిన హామీలు అమలుచేయాలని, 5వ షెడ్యూల్ పక్కగా అమలు చేయాలని, ఏజెన్సీలో దామషా పద్ధతి కాకుండా 100శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, మెగా డిఎస్సి నుండి ఏజెన్సీ ప్రాంతా టీచర్ , గురుకుల పోస్టుల భర్తీకి మినహాయింపు ఇవ్వాలని, ఏకలవ్య విద్య సంస్థల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు స్థానికులతోభర్తీచేయాలనే తదితర డిమాండ్లతో 8 మండలాల్లో 8 రోజులపాటు యువతి యువకులకు చైతన్య పరుస్తూ ఈనెల 8న పాడేరు ఐటిడిఏ ముట్టడి మహా ధర్నాకు సిద్ధం కావాలని గిరిజన సంఘం, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో జీపు జాత నిర్వహిస్తూ ముగింపు రోజు నాటికి పెద్ద ఎత్తున అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతి యువకులు స్వచ్ఛందంగా తరలివచ్చి పాడేరు పట్టణ రోడ్లంతా కుక్కిరించి పోయారు. పెద్ద ఎత్తున యువతి యువకులు కదం తొక్కి బారి ప్రదర్శన చేశారు. దీంతో రోడ్లన్నీ వాహనాలతో గంటల తరబడి స్తంభించిపోయింది. ఈ సందర్భంగా అప్పల నరస, కాంతారావు, రాధాక్రిష్ణ, హేమావతి, బలదేవ్, పలువురు వక్తలు మాట్లాడుతూ ఏదైతే యువతి యువకుల డిమాండ్ లైతే ఉందొ ప్రభుత్వ వెంటనే స్పందించాలని, వాటిని అమలు చేయాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ఆదివాసీ దినోత్సవం నాటికి(9) నాటికి ప్రకటన చేసిన తన నిజాయితీ నిరూపించు కోవాలనీ కోరారు. హామీలన్నీ అమలుచేయకపోతే రాబోయే రోజుల్లో గిరిజన ప్రాంతాల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి 8 మండలాల నుంచి అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతి యువకులు, ఆదివాసీలు పాల్గొన్నారు.

తెదేపా పాడేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిని మార్చండి

తెదేపా మాజీ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య విజ్ఞప్తి

విశాలాంధ్ర-చింతపల్లి : తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి ని మార్చాలని ఆ పార్టీ చింతపల్లి మండల మాజీ ఉపాధ్యక్షుడు కిముదు లక్ష్మయ్య అన్నారు. మండలంలోని లంబసింగి గ్రామంలో తెదేపా చింతపల్లి మండల మాజీ ఉపాధ్యక్షుడు కిముదు లక్ష్మయ్య ఆధ్వర్యంలో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో లంబసింగి మాజీ ఎం పి టి సి సభ్యుడు పొత్తూరు రాంబాబు తో కలసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెదేపా పాడేరు నియోజకవర్గ ఇంచార్జ్ గా ఉన్న గిడ్డి ఈశ్వరి గత కొన్ని నెలలుగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకొంటూ, తెదేపా నాయకులను, కార్యకర్తలను ఏమాత్రం పట్టించు కోవడం లేదని ఆరోపించారు. నియోజకవర్గం పరిధిలో 5 మండలాలు ఉన్నాయని, ఈ మండలాల్లోని నాయకులను కార్యకర్తలను గత కొన్ని నెలలుగా ఆమె పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఈ విషయమై తెదేపా అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టి సారించి, సమస్యగా ఉన్న తెదేపా నియోజకవర్గ ఇన్చార్జిని తక్షణమే మార్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో తెదేపా నాయకులు టి.రామారావు, బోనంగి బంగారు పడాల్, వీరయ్యదొర, బంగారయ్య, జి.వెంకటరమణ, బోనంగి బెన్న లింగేశ్వరరావు, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి

ఆదివాసీ పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం అధ్యక్ష కార్యదర్శులు మహేష్, కృష్ణ

విశాలాంధ్ర-పాడేరు : సుదీర్ఘకాలంగా వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొం టున్న సమస్యలను పరిష్కరించాలని, ఆదివాసి పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం అధ్యక్ష కార్యదర్శులు మహేష్,కృష్ణ అన్నారు. శుక్రవారం ఆ సంఘ నెలవారి సమావేశంలో వారు మాట్లాడుతూ జర్నలిస్టుల స్థలాల కేటాయింపు, పెన్షన్ చెల్లింపు, అక్రిడిటేషన్ల జారీకి వీలుగా కొత్త జీఓ తీసుకురావడం, మీడియాలోని ప్రస్తుత పరిస్థితిని అధ్యయనం చేసేందుకు వీలుగా మీడియా కమిషన్ ఏర్పాటు, జర్నలిస్టులకు అవార్డుల ప్రధానం, రాష్ట్ర కేంద్రంలో వృద్ధ జర్నలిస్టుల కోసం ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్మాణం తదితర అంశాలు ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు.జర్నలిస్టుల దాడులను అరికట్టాలని, జర్నలిస్టులంతా ఐక్యంగా ఉంటూ జర్నలిస్టుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హర్ష ,కోటి, రామ్, లక్ష్మేశ్వరరావు, దిలీప్, విజయ్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఘనంగా వరలక్ష్మి వ్రత పూజలు

విశాలాంధ్ర-సీతానగరం : స్థానిక శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో 3వ శ్రావణ శుక్రవారంనాడు వరలక్ష్మీవ్రత దినోత్సవ సందర్భంగా శ్రీవరలక్ష్మీదేవికి ఘనంగా పూజలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కుంకుమార్చన పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు, కె.శ్రీనివాసరావు, ఆమంచి శ్రీనివాసచార్యులు వరలక్ష్మి వ్రత పూజలను చేయించారు. ఈపూజా కార్యక్రమంలో అర్చకులు కృష్ణమోహన్ ఆచార్యులు,కె.మురారి,బృందావనం, ఉదయ కృష్ణమాచార్యులు,పవణ్ కళ్యాణ్ ఆచార్యులు, మనోజ్ వంశీ కృష్ణమాచార్యులు, విహారి, ప్రసాద్,మనోజ్, శ్రీకర్లు పాల్గొని భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఇదిలా ఉండగా అన్ని ఆలయాలతో పాటు గ్రామ గ్రామాల్లో, ప్రతి ఇంటిలో వరలక్ష్మీ వ్రతం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఘనంగా అడవి తల్లి విగ్రహానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం ఐటిడిఎ కార్యాలయంలోని "అడవి తల్లి" విగ్రహానికి గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఐటిడిఎ పిఓ అసుతోష్ శ్రీవాస్తవ, ఎపిఓ మురళీధర్, డిడి కృష్ణవేణి ఇతర అధికారులు, గిరిజన సంఘాల నాయకులు పాలక రంజిత్ కుమార్, పల్ల సురేష్, ఆరిక చంద్రశేఖర్, ఇంటికొప్పల రామకృష్ణ, బిడ్డిక తమ్మయ్య, దుక్క సీతారాం, మంచాల పారమ్మ, కోలక గౌరమ్మ, బొత్తాడ గౌరీ శంకర్రావు, రొబ్బ లోవరాజు, ఆరిక విప్లవ కుమార్, గేదెల రామకృష్ణ, మండల గిరిధర్, తాడంగి సాయిబాబు, ఊర్లక నాగార్జున, ధోని సురేష్, జట్ల బంగార్రాజు, చెల్లూరి సీతారాం, మజ్జి నారాయణ, జలుమూరి మణికుమార్, ఉడతల సత్యం, ఆదారి వెంకటరమణ, పాలవలస భగవాన్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ అభివృద్ధి ఫలాలు గిరిజనులకు అందాలని, గిరిజన చట్టాలు, హక్కులు సక్రమంగా అమలు జరిగే విధంగా చూడాలని, దీవించాలని అడవి తల్లికి పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఐటిడిఎ పిఓ ను ఇంటి వద్ద నుండి గిరిజన సంప్రదాయ దుస్తులతో అడవి తల్లి విగ్రహం వరకు ఊరేగింపుగా తీసుకుని రావడం జరిగింది. జిల్లా కలెక్టర్, పిఓ గిరిజనులతో కలిసి సంప్రదాయ నృత్యం చేసి ఉత్సాహంగా పాల్గొన్నారు.

'ఓ ప్రేమ' చిత్రం మంచి విజయం సాధించాలి

సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : స్ట్రీన్ ప్లే పిక్చర్స్ పతాకం పై ప్రవీణ్ కె.వి నిర్మాణంలో చిరంజీవి కృష్ణపల్లి దర్శకత్వంలో మొదటి చిత్రంగా రూపుదిద్దుకుంటున్న "ఓ ప్రేమ" చిత్రం మంచి విజయం సాధించాలని ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్ అన్నారు. ఈ మేరకు పార్వతీపురానికి చెందిన చిత్ర బృందం అమరావతిలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ చిత్రానికి సంబంధించి సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి హామీ ఇవ్వడంతో యూనిట్ బృందం ఆనందం వ్యక్తం చేసింది. పార్వతిపురం చేరుకున్న దర్శకులు చిరంజీవి శుక్రవారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ మంచి ప్రేమ కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని, ప్రేక్షకులు ఆదరించాలని కోరారు.ఇటీవల కులుమనాలి, అరకు ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకోవడం జరిగిందని, మరి కొన్ని రోజులు పార్వతిపురం మన్యం జిల్లా పరిసర ప్రాంతాల్లో చిత్రానికి సంబంధించిన మిగిలిన షెడ్యూల్ పూర్తి చేసి త్వరలోనే తెరగెక్కించబోతున్నామన్నారు.ఈ అవకాశం ఇచ్చిన మంత్రికి ఓ ప్రేమ మూవీ టీమ్ కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో హీరో సాయి తేజవర్మ, హీరోయిన్ మధుస్మిత, నటులు శాంతారామ్, ప్రసాద్ ఉద్దవోలు, జీ.బాల భాస్కర్. సాయి లంక, అసిస్టెంట్ డైరెక్టర్ పృథ్వీరాజ్, మేనేజర్ సంపత్ కుమార్. పాల్గొన్నారని తెలిపారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

- పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి - సిపిఎం పార్టీ, ప్రజా సంఘాలు డిమాండ్!

విశాలాంధ్ర-బలిజిపేట : గురువారం ఆగస్టు 6 బలిజిపేట మండలం చిలకలపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం పార్టీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు! అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.. ఈ సందర్భంగా లిసిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు మండల నాయకులు బొద్దాన భానుమూర్తిలి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు పెంచమని ప్రజలకు హామీ ఇచ్చిన కూటమి పెద్దలు ఇప్పుడు విద్యుత్ చార్జీలను దొడ్డిదారిన పెంచడం ఎంతవరకు సమంజసమని విమర్శించారు, స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని చెప్పి అధికారం చేపట్టిన తర్వాత అవే స్మార్ట్ మీటర్లను ప్రజలకు బలవంతంగా అంటగట్టి వేలాది రూపాయలు భారం ప్రజలపై మోపడం మంచిది కాదు బలిజిపేట మండలంలో సుమారు 760 స్మార్ట్ మీటర్లు పెట్టారు వెంటనే రద్దు చేయాలి? ట్రూ అప్ చార్జీలు కస్టమర్ చార్జీలు సర్ చార్జీలు రద్దు చేయాలి రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని మీటర్ల పెట్టే ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు.లేనియెడల ప్రజలలో విద్యుత్ ఛార్జీలపై, స్మార్ట్ మీటర్ల పై విస్తృతంగా ప్రచారం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో లిసిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు ప్రజా సంఘాల నాయకులు పీసా వెంకటస్వామి నల్ల ఈశ్వరరావు ఓల సత్యం, నారాయణ రావు, శివ, వెంకటేష్, యమ్మల మన్మధరావు, తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్‌సిటి ప్యాకేజీలను వివరించిన అధికారులు

విశాలాంధ్ర-పార్వతీపురం : ఇండియన్ రైల్వే క్యాటరింగ్ & టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (భారత ప్రభుత్వ సంస్థలు)బద్రీనాథ్ - కేదార్నాథ్ - గంగోత్రి - యమునోత్రి, కేరళ, రాజస్థాన్, అండమాన్ దీవులకు ప్రత్యేక విమాన ప్యాకేజీని ప్రారంభించిందని డా. క్రాంతి పి. సవార్కర్ (జెజిఎం/టి/బిబిఎస్/ఐఆర్సిటిసి)లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈప్యాకేజీ విశాఖపట్నం నుండి ప్రారంభమవుతుందని చెప్పారు. అందమైన కేరళకు విశాఖపట్నం నుండి (ఎస్.సి.బి.ఎ70) **గమ్యస్థానాలు :** కొచ్చి- మున్నార్ - తేక్కడి - కుమారకోమ్ - అనంత పద్మనాభస్వామి ఆలయం పర్యటన వివరాలను తెలిపారు. రాయల్ రాజస్థాన్ టూర్ విశాఖపట్నం నుండి (ఎస్.సి.బి.ఎ57) గమ్యస్థానాలు - జైపూర్ - బికనీర్ - జైసల్మేర్ - జోధ్పూర్ - ఉదయపూర్ - మౌంట్ అబూ - పుష్కర్ - అజ్మీర్ పర్యటన వివరాలను వివరించారు. విశాఖపట్నం నుండి బద్రీనాథ్ యాత్ర-కేదార్నాథ్ గంగోత్రి - యమునోత్రి (చార్ ధామ్ - ఉత్తర భారతదేశం) (ఎస్.సి.బి.ఎ44ఎ) గమ్యస్థానాలు : బద్రీనాథ్ - బర్కోట్ - గంగోత్రి - గుప్తకాశీ - హరిద్వార్ - కేదార్నాథ్ - సోనయాగ్ - యమునోత్రి పర్యటన వివరాలను తెలిపారుఎల్.టి.సి అండమాన్ ఎమరాల్డ్ (ఎస్.సి.బి.ఎ50) గమ్యస్థానాలు పోర్ట్ బ్లెయిర్, రాస్ & నార్త్ బే ఐలాండ్, హార్లాక్ & నీల్ ఐలాండ్ పర్యటన వివరాలను వివరించారు. ఇండిగో ఎయిర్లైన్స్ ఎకానమీ క్లాస్ విమానటిక్కెట్లు, ఎయిర్లైన్స్, హెూటల్ వసతి.

అల్పాహారాలు & 5 విందులు (స్థిరమైన మెనూ) షేరింగ్ ప్రాతిపదికన ఎసి వాహనంలో ప్రయాణ ప్రణాళిక ప్రకారం అన్ని బదిలీలు మరియు సందర్శనా స్థలాలు, ప్రయాణ బీమా, టూర్ మేనేజర్ సేవలు పేర్కొన్న సేవలకు వర్తించే అన్ని పన్నులు ఉంటాయని తెలిపారు.

రాబోయే ప్యాకేజీలు : దేశీయం - మేఘాలయ, గుజరాత్, మధ్యప్రదేశ్ & మొదలైనవి, అంతర్జాతీయం-నేపాల్, దుబాయ్, శ్రీలంక, సింగపూర్, మలేషియాలు ఉంటాయన్నారు. వివరాలకు చందన్ కుమార్ 9281030748, సాయిప్రసాద్ 9281495847 వెంకటేశ్వరరావు 9550166168 కేరాఫ్ ఐఆర్సిటిసి ప్రధాన ప్రవేశ ద్వారం, గేట్ నెం-1, రైల్వే స్టేషన్, విశాఖపట్నం లను సంప్రదించాలన్నారు. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలలో టూర్లు ఉంటాయని తెలిపారు.

గిరిజనులకు 100 శాతం న్యాయం జరిగేలా చూడాలి

విశాలాంధ్ర-జీకే వీధి : ప్రపంచ ఆదివాసి దినోత్సవ పురస్కరించుకొని పాడేరు విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు పత్రిక ముఖముగా తెలిపిన అంశాలను పరిష్కరిస్తారని గిరిజన ఐక్యవేదిక అధ్యక్షులు కొక్కుల రామారావు అన్నారు. ఇటీవల జరిగిన డీఎస్సీ రాత పరీక్ష లో గిరిజన ప్రాంతంలో 100% గిరిజన అభ్యర్థులకు ఉద్యోగులు నియమకం జరగాలన్నారు. పాడేరు వైద్య కళాశాలను ప్రైవేట్ కాకుండా ప్రభుత్వ ఆధీనంలో నడపాలన్నారు. గిరిజన యూనివర్సిటీ ప్రస్తుత విధానం నత్త నడకన సాగుతున్నది, దీన్ని పూర్తిస్థాయిలో నిధులు వెచ్చించి యూనివర్సిటీ పనులు పూర్తి చేసి అడ్మిషన్లు అమలైల చేయాలన్నారు. గిరిజన సహకార సంస్థలో పూర్తిస్థాయి ఉద్యోగులు లేనందున ప్రస్తుతం 1100 మంది ఉండవలసిన పరిస్థితిలో కేవలం 200 మంది మాత్రమే పని చేయు చున్నారు. ఈ సంస్థలో పూర్తిస్థాయి ఉద్యోగ నియమకాలు బ్యాక్లాక్ పోస్టులు చేపట్టి సంస్థ సక్రముగా నడుపుటకు, గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయిన్నారు. ఎస్టీ జాబితాలో ఇతర కులాలను చేర్చుటకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తునందున గిరిజనులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఇటువంటి ప్రయత్నాలు రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని, గిరిజనులకు న్యాయం జరిగేలా చూడాలని, గిరిజన ఐక్యవేదిక అధ్యక్షులు కొక్కుల రామారావు కోరారు.

నేడు మండల కేంద్రంలో 7గంటల పాటు విద్యుత్ నిలుపుదల

విశాలాంధ్ర-సీతానగరం : మండల కేంద్రంలోని సీతానగరం, పెదబోగిల, బుడ్డిపేట తదితర ప్రాంతాల్లో 11 కేవీ ఎల్టీ లైన్లో తగిలిన చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం ఉదయం7గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ శశి భూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు.కావున సీతానగరం, పెదభోగిల, బుడ్డిపేట తదితర గ్రామాల ప్రజలు గమనించగలరని, విద్యుత్ శాఖకి సహకరించగలరని కోరారు.

అవినీతి అధికారి అడ్రస్ గల్లంతు

- ఎమ్మెల్యే పేరు చెప్పి అక్రమ వసూళ్లు చేసిన అధికారి
- విశాలాంధ్ర కథనాలకు, సిబ్బంది మనోవేదనకు, స్పందించిన అధికారులు
- అధికారి సరెండర్‌తో ఊపిరి పీల్చుకున్న ఉద్యోగులు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: అక్రమ సంపాదనే లక్ష్యంగా చేసుకొని ఐదు నెలలకాలంలో లక్షలాది రూపాయలు కూడపెట్టిన ఒక అవినీతి అధికారి అడ్రస్ నేడు గల్లంతైంది వివరాలలోకి వెళ్తే స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా సిహెచ్ వెంకటేశ్వర్లు ఫిబ్రవరి 12వ తేదీన బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన సమయంలో మహిళా సిబ్బందిని లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారన్న ఆరోపణలను అప్పటి తెలుగు దేశం పాలకవర్గం సభ్యులు ఉమెన్ అండ్ చైల్డ్ అధికారులకు పిర్యాదు చేయడంతో ఆరోపణలు రుజువు కావటంతో వెంకటేశ్వర్లును అధికారులు సరెండర్ చేయడం జరిగింది.అనంతరం గాలిలో ఉన్న ఈయనను సిడిఎంఏ పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా ఓన్‌పే మీద నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.ఈయన విధుల్లో జాయిన్ అయిన కొద్దిరోజుల నుంచే విభజించి పాలిస్తూ మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్, రెవెన్యూ, పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక, పరిపాలన విభాగ అధికారులను పక్కన పెట్టి ఒక సీనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగి సహాయముతో అన్ని విభాగాల కు చెందిన పనులను ఈయనే చక్క పెట్టుకొని సంబంధిత పైల్లపైన సంతకాలు చేయమని విభాగ అధికారులపై ఒత్తిడి తెస్తూ సంతకాలు చేయకపోతే ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని సెక్షన్ అధికారులను బెదిరించే సంఘటనలు చోటు చేసుకున్నాయి.ఓ ఇంటికి ప్లాన్ కావాలన్నా, ఇంటిపన్ను వేయాలన్న, బదిలీ అయిన ఉద్యోగులు రిలీవ్ కావాలన్నా, ఉద్యోగులు డిపార్ట్మెంట్ పరీక్షలు నిమిత్తం సెలవు పెట్టిన సందర్భాలలో ఆ సెలవు మంజూరు చేయాలన్న,చివరకు జనన మరణ పత్రాలు మంజూరు చేయాలన్న ఈయన చేతికి చమురు అంటనిదే పని జరిగే పరిస్థితి లేదు.అంతేకాకుండా ఇంటి ప్లాన్లు మంజూరు, అనధికార కట్టడాలు, పన్నులు వేయటంతో సహా అన్నింటిలోనూ స్థానిక శాసనసభ్యుల పేరు చెప్పి లక్షలాది రూపాయలు ఈయన వసూలు చేశారని ప్రజలే బహిరంగంగా చెప్పడం విశేషం. పట్టణంలోని ఒక ప్రాంతంలో చెరువుగట్టుపై ప్రభుత్వ అనుమతులతో నివాసం ఏర్పాటు చేసుకున్న 23 గృహాలను తొలగిస్తామని, గత వైసిపి ప్రభుత్వ హయాంలో నియామకం చేసిన మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఉద్యోగులను తొలగిస్తామని ఎమ్మెల్యే పేరు చెప్పి లక్షలాది రూపాయలు వసూళ్లకు పాల్పడ్డారన్న విషయం పట్టణంలో హల్చల్ చేసిన సంగతి అందరికీ తెలిసిందే. ఇలా ప్రతి విషయానికి ఎమ్మెల్యే పేరు ముడిపెట్టి లక్షలాది రూపాయలు ఈయన దండుకున్నారని ప్రతి పనికి ఒక రేటు కట్టి వసూళ్లు చేసేవారని,అంతేకాకుండా సెక్షన్ అధికారులను పైసలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేసిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. మేము ఎందుకు ఇవ్వాలని ఎవరైనా ప్రశ్నిస్తే నేను లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఇక్కడికి వచ్చానని అవి ఎలా భర్తీ చేసుకోవాలని ఎటువంటి అనుమానం లేకుండా ఈయన చెప్పే సమాధానం ప్రజలకు, ఉద్యోగులకు ఆశ్చర్యానికి గురిచేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఎవరైనా ఎదురుతిరిగి ఇది మంచి పద్ధతి కాదు అని ప్రశ్నిస్తే నన్నెవరూ ఏమీ చేయలేరు. నావెనక స్థానిక శాసనసభ్యులతో పాటు,అనేకమంది సపోర్టు ఉందని చెప్పడం గమనార్హం.ఈ అధికారి పెట్టిన నిబంధనలకు, నియమాలకు ఇబ్బందులకు గురైన ఉద్యోగులు ఈ కమిషనర్ మాకొద్దు. ఈయన వద్ద మేము ఉద్యోగాలు చేయలేము. అంటూ స్థానిక శాసనసభ్యులు బోనెల విజయచంద్రకు, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ కు వారి గోడును వినతి రూపంలో ఫిర్యాదు చేశారు.ఉద్యోగుల ఫిర్యాదులను పరిగణలోకి తీసుకొని అధికారులు ఈయనను సిడి ఎంఏ కార్యాలయానికి సరెండర్ చేస్తూ జీవో విడుదల చేశారు. జీవో జారీ చేయడంతో శుక్రవారం కార్యాలయం నుంచి రిలీవై వెళుతున్న ఆయన అవినీతి శాఖ అధికారులకు నన్ను అప్పగిస్తారేమోనన్న భయం నాలో ఉండేదని సరెండర్ చేయించి నాకు మంచి పని చేశారని సిబ్బందితో ఈ కమిషనర్ అనటం కొసమెరుపు.

వైసీపీ ఒక దళిత వ్యతిరేక పార్టీ

- దళితులపై కిరాతకానికి పాల్పడినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

విశాలాంధ్ర-పాడేరు : వైసిపి ఒక దళిత వ్యతిరేక పార్టీ అని ఆనాడు అధికారంలో ఉన్నప్పుడు దళితుల మీద దమనకాండ కొనసాగించిందని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కిడారి క్యాంప్ కార్యాలయంలో విలేఖర్లతో మాట్లాడుతూ కలియుగ వేంకటేశ్వర స్వామి కొలువైన పవిత్రమైన తిరుమల తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో వైసీపీ అనుచరులు ఒక దళిత యువకుడిపై చేసిన క్రూరమైన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ దాడి కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దౌర్జన్యం మాత్రమే కాదని, ఇది దళిత సమాజం మీద వైసీపీ నాయకత్వం చూపిస్తున్న దమనకాండకు నిదర్శనమన్నారు.తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు అభినయ్ రెడ్డి కార్యాలయంలో వైసీపీ రౌడీలు ఒక దళిత యువకుడిని బంధించి, స్పృహ కోల్పోయే వరకు క్రూరంగా కొట్టారు. ఈ దారుణ ఘటనను వీడియో తీసి, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తూ, బాధితులను భయపెడుతున్నారు. ఈ దారుణమైన ఘటన పుణ్యక్షేత్రమైన తిరుపతిని అపవిత్రం చేయడమే కాక, భూమన కరుణాకర్ రెడ్డి రౌడీయిజంతో సమాజంలో భయాందోళనలను సృష్టిస్తున్నాడనడానికి స్పష్టమైన ఆధారం. తెల్లారి లేస్తే రౌడీయిజం చెయ్యడం... ప్రెస్ మీట్లు పెట్టి శుద్ధపూస స్టేట్మెంట్స్ ఇవ్వటం ఇదే భూమన నైజం... పరమ పవిత్రమైన తిరుమల తిరుపతిలో రౌడీయిజం చేస్తూ తిరుమల పవిత్రత దెబ్బతీసే కుట్ర నిత్యం చేస్తూనే ఉన్నాడని, మాస్క్ అడిగిన పాపానికి ఏకంగా అధినేత ఒక డాక్టర్ని పొట్టన పెట్టుకున్నాడు ఆ పార్టీలో ఒకడేమో దళితుడిని చంపి డోర్ డెలివరీ చేస్తాడు. ఇంకొకడు గుండు కొట్టిస్తాడు. వైసీపీ ఒక దళిత వ్యతిరేక పార్టీ... అధికారంలో ఉన్నప్పుడు దళితుల మీద దమనకాండ కొనసాగించారన్నారు. అధికారం కోల్పోయిన అదే తీరు కొన సాగిస్తున్నారని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని,భూమన కరుణాకర్ రెడ్డి లాంటి వారి రౌడీయిజం, అక్రమాలను సహించే ప్రసక్తే లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎవరినీ వదిలిపెట్టదు, న్యాయం జరిగేలా కఠిన చర్యలు తీసుకుంటుంద న్నారు. తిరుమల పవిత్రతను కాపాడేందుకు, సమాజంలో శాంతి భద్రతలను నెలకొల్పేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. ఈ కిరాతకానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు.

పీఎం జన్మన్, గ్రామీణ ఇళ్లకు నిధులు పెంచుతామన్న హామీని నిలబెట్టుకోండి

గాలికొండ పంచాయతీ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు డిమాండ్

విశాలాంధ్ర-జీకే వీధి : రాష్ట్ర ప్రభుత్వం పిఎం జన్మన్, గ్రామీణ ఇల్లులకు పెంచుతామని హామీని అమలుచేయాలని గాలికొండ పంచాయితీ ఎంపిటిసి, బుజ్జి బాబు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ హౌస్‌కి 70వేలు, పిఎం జన్మన్, హౌస్‌కి, 1లక్ష రూపాయలు పెంచుతామని చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో హాజరైన సందర్భంగా ఇచ్చిన హామీపై నిధులు విడుదలకు ప్రకటన చేయాలని ఎంపిటిసి కోరారు.అలాగే ప్రత్యేక గిరిజన డిఎస్సీ, జివో నెంబర్ 3పై ఎన్నికల్లో ఇచ్చిన హామీలను స్పష్టమైన వైఖరి ప్రకటించాలని, గిరిజన ప్రాంతాల్లో ఉన్న మారుమూల గ్రామాల్లో, రోడ్లు పై ఫారెస్ట్, శాఖ, అడ్డంకులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమనికి, డి కొత్తూరు గ్రామస్థులు, కృష్ణ, రాం బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

విశాలాంధ్ర-బలిజిపేట : జాతీయ చేనేత దినోత్సవంను జిల్లాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. బలిజీపేట మండలం నారాయణపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో చేనేత వస్త్ర ధారణ వలన ప్రయోజనాలు వివరిస్తూ ర్యాలీ చేసారు. చేనేత కార్మికులను సన్మానించారు. చేనేత జౌళి శాఖ సహాయ అభివృద్ధి అధికారి ఎన్ వెంకట రమణ మాట్లాడుతూ చేనేత కార్మికులకు ప్రభుత్వం నుండి వచ్చే సాయంపై వివరించారు. ఆగస్టు నెల నుండి 2 వందల యూనిట్ లు కరెంట్ ఉచితంగా ప్రభుత్వం అందించడమే కాకుండా జి ఎస్ టి ని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిజైనర్ ప్రసాద్, వెంకటేష్, చేనేత సంఘం మాజీ అధ్యక్షులు చప్పటి నారాయణరావు, కల్లూరు గౌరిశ్వరరావు, కొండక అప్పారావు, కాలేపు వీర్రాజు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

సంక్షేమ సహాయకురాలు సోయం శ్రీ సౌమ్య అపహరణ ఆరోపణలు!

కొనసాగుతున్న దర్యాప్తు

విశాలాంధ్ర-దేవీపట్నం : ఆగస్ట్ 7, 2025న జరిగిన అపహరణ సంఘటనకు సంబంధించి ఫిర్యాదు నమోదు అయ్యింది అని. ఈ సంఘటనలో నర్సాపురం గ్రామానికి చెందిన, ప్రస్తుతం సారభవరంలో వెల్ఫేర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న మల్లుడోరా కుమార్తె, 26 సంవత్సరాల సోయం శ్రీ సౌమ్య అపహరణకు గురయ్యారు. ఫిర్యాదు ప్రకారం, ఆగస్ట్ 7న ఉదయం 10:30 గంటల సమయంలో, వేటుకూరు గ్రామానికి చెందిన కాసిమ్కోట అనిల్ కుమార్ మరియు మరికొందరు సహాయంతో బూడిద రంగు ఇన్నోవా క్రిస్టా (AP31 TJ 1462) వాహనంలో ఆమెను అపహరించారని తెలుస్తోంది. గతంలో కూడా ఈ వీరు 21-10-2024న ఇలాంటి సంఘటనలో భాగంగా ఉన్నారు. ఆ సందర్భంలో దేవీపట్నం పోలీసుస్టేషన్‌లో మహిళా కనుమరుగు కేసు (Cr. No. 70/2024) నమోదు చేయబడింది. ఆ కేసు విచారణలో కుటుంబాల వ్యతిరేకత కారణంగా ఇద్దరూ స్వేచ్ఛగా తప్పించుకున్నారని, చిత్రకొండ (ఒడిశా)లో వారిని గుర్తించారు. పోలీసులు అప్రమత్తమై సారభవరం, మారేడుమిల్లి మరియు ప్రయాణ మార్గాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌ని, సబ్-డివిజన్ మరియు సరిహద్దు ప్రాంతాల్లోని చెక్-పోస్టులకు సంబంధిత వాహనం పట్ల హెచ్చరికలు జారీ చేశారు. బాధిత మరియు ఆరోపితుడి స్వగ్రామాల్లో శోధనా కార్యకలాపాలను పరిశీలించారు. ఆరోపితుడి మునుపటి ప్రాంతాలు మరియు తెలిసిన సహచరులను పరిశీలించారు. సంబంధిత వాహనం మరియు ఆరోపితుని వివరాలు అన్ని సమీప పోలీసు స్టేషన్లతో పంచుకోబడ్డాయి. ఈ కేసు గతంలో జరిగినట్లుగా అపహరణా లేక స్వచ్ఛందంగా తప్పించుకున్న సంఘటనా అని విచారణ ద్వారా నిర్ణయించబడుతుంది. ప్రజలు సహకరించాలని మనవి. సంబంధిత సమాచారం ఉన్నవారు దయచేసి క్రింది నంబర్లకు కాల్ చేయండి: 9440900761, 9440796517. మీడియా సభ్యులను కూడా సహకరించాలని అభ్యర్థిస్తున్నాము. విచారణలో మరిన్ని విషయాలు తెలియపరుస్తామని చెప్పారు.

ఘనంగా ఆదివాసి గిరిజన వారోత్సవాలు

విశాలాంధ్ర-మక్కువ : మండలంలోని, లోతుగడ్డ గ్రామంలో ఆదివాసి గిరిజన వారోత్సవాల్లో భాగంగా, ఆదివాసి గిరిజన జండాను లోతుగడ్డ గ్రామ శాఖ నాయకులు, సిహెచ్ కృష్ణ జెండాను ఎగరవేశారు, కార్యక్రమంలో మండల గిరిజన నాయకులు, తాడంగి ప్రభాకర్ మాట్లాడుతూ, మన గిరిజనులు మన సంస్కృతి సాంప్రదాయాలను భాషను కాపాడుకుంటూ, మన హక్కులు రిజర్వేషన్లను చట్టాలను కాపాడుకోవాలి అని అన్నారు, జీవో నెంబర్3 ప్రత్యేక గిరిజన, డీఎస్సీ గిరిజన స్వయం పాలిత ప్రాంతాల కోసం మన గిరిజన ప్రజలు యువతి యువకులు, గిరిజన హక్కుల కోసం పోరాడాలని అన్నారు, ఈ కార్యక్రమంలో సిహెచ్ సౌంద్యా, సిహెచ్ బాలయ్య, మరియు గిరిజనులు పాల్గొన్నారు.

వీఆర్ఏ లకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి

విశాలాంధ్ర-మక్కువ : గ్రామ రెవెన్యూ సహాయకులు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మన్యం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది, మండల కేంద్రంలో శుక్రవారం వీఆర్ఏ లు, మండల మహాసభ అధ్యక్షులు జి పవన్ కళ్యాణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీఆర్ఏల జిల్లా కార్యదర్శి, మాట్లాడుతూ గత ప్రభుత్వం మరియు కోటమీ

ప్రభుత్వం , వీఆర్ఏలను వాడుకుంటున్నాయి తప్ప, ఉద్యోగ భద్రత కల్పించడంలో ఏమాత్రం కృషి చేయడం లేదని తెలిపారు, వారసత్వ హక్కు ఇవ్వవలసి ఉన్న రాష్ట్ర ప్రభుత్వం మేనమేషాలు లెక్కిస్తుందని అన్నారు, గ్రామాల్లో నేరుగా ప్రజలకు సేవను అందిస్తున్న మొదటి వరుసలో వీఆర్ఏలు ఉంటారని అంతటి ప్రాథమిక గల వర్కర్ల సమస్యలు పరిష్కరించడానికి సిద్ధపడకపోవడం అన్యాయమని తెలిపారు, వీఆర్ఏలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు, 12వ పిఆర్సి వెంటనే ప్రభుత్వం ప్రకటించి పెరుగుతున్న ధరలకు తగినట్లుగా వేతనాలను పెంచాలని కోరారు, వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని, సెప్టెంబర్ 13 14 సిఐటియు మహాసభలు పాలకొండ పట్టణంలో జరుగుతాయని ఈ మహాసభ వేదిక భవిష్యత్తు కార్యక్రమంలో వీఆర్ఏలంతా సిద్ధపడాలని పిలుపునిచ్చారు వీఆర్ఏల మండల సంఘ అధ్యక్షుడిగా జి పవన్ నియమకం, మండలంలో నూతన కార్యవర్గం ఎన్నిక నూతన అధ్యక్షుడిగా జి.పవన్‌కళ్యాణ్, ఉప అధ్యక్షులుగా డి.సింహాచలం, కోశాధికారిగా బి.పార్వతి, ఏ హైమావతి, కమిటీ సభ్యులుగా ముకుంద, సూరమ్మ భాస్కరరావు లను ఎన్నుకోవడం జరిగినది.

శక్తి టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు

విశాలాంధ్ర-సీతానగరం : శక్తి టీం ఏఎస్ఐ

శ్రీరాములు, హెడ్ కానిస్టేబుల్ సీతయ్యల ఆధ్వర్యంలో శుక్రవారం నాడు మండలంలోని జోగంపేట కేజీబీవీ, ప్రతిభ కళాశాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఆయా కళాశాలల అధ్యాపకులు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉంటూ ఉత్తమ లక్ష్యం కలిగి ఉండాలి

ఎస్ఐ నీలకంఠరావు

విశాలాంధ్ర-కురుపాం : యువత మత్తు పదార్థాలు కు దూరంగా ఉంటూ ఉత్తమ లక్ష్యం కలిగి ఉండాలని నీలకంఠ పురం ఎస్ ఐ నీలకంఠ రావు సూచించారు. శుక్రవారం మండలంలోని లంకజోడు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను నీలకంఠపురం ఎస్ఐ ఎ. నీలకంఠరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల సందర్శించి మొక్కలను నాటడం జరిగిందని అనంతరం విద్యార్థులకు వారి యొక్క విద్య అభివృద్ధి మెరుగుపరుచుకోని ఉన్నత స్థానంలో స్థిరపడడానికి పలు సూచనలు సలహాలు అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పాచిపెంట : మన్యం జిల్లా పార్వతీపురం పట్నంలో ఈ నెల 27న జరగనున్న కృష్ణ మాదిగ కార్యక్రమానికి మన్యం జిల్లా మంద కృష్ణ మాదిగ నిర్వహిస్తున్న కార్యక్రమానికి హాజరుకావాలని జిల్లా పిలుపునిచ్చారు. పాచిపెంటమండలం, తోట వలస, కొత్త వలస,చెరుకుపల్లి , మక్కువ మండలం మార్కొండపుట్టి, కవిరిపల్లి,సాలూరు మండలం ,బొగ వలస, గ్రామాలు మాదిగ ప్రజలు తో సమావేశం అయ్యారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈనెలనేల 27న పార్వతీపురము లో జరగ బోతున్న సమావేశం కి ఎమ్మార్పీఎస్ అదినేత, పద్మ శ్రీ మందా కృష్ణ మాదిగ హాజరు కాబోతున్నారని అన్నారు. ఎస్సీ, వర్గీకరణ విజయోత్సభ సభ నీ జయప్రదము చెయ్యాలని కోరుతూ హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి శ్రీ బోసు మన్మథ రావు మాదిగ, సాలూరూ నియోజక వర్గం ఇంచార్జి చింతాడ అప్పారావు మాదిగ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించ నున్నారని తెలిపారు.

ప్రతి ఇంటిలో వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించిన మహిళలు

విశాలాంధ్ర-సీతానగరం : శ్రావణమాసంలో మూడవ శుక్రవారంనాడు వచ్చిన వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు ప్రతిఇంటిలో నిర్వహించడం సర్వత్రా కనిపించింది. ఈ ఏడాది ప్రభుత్వం కూడా సెలవు దినముగా ప్రకటించడంతో ప్రశాంతంగా పూజను చాలాచక్కగా నిర్వ హించారు. వరలక్ష్మి వ్రతం భక్తిశ్రద్ధలతో మహిళలు చేయడంవలన కుటుంబానికి మంచి, సంపద, ఆరోగ్యం, కుటుంబం సామ రస్యంగా ఉంటుందనే ప్రగాఢంగా నమ్ముతారు. రామాయణ మహాభారతాలు, పురాణాలలో కూడా దీని ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయి. వరలక్ష్మీదేవికు భక్తిశ్రద్ధలతో పూజలు చేయడంతోపాటు కలశస్థాపన, కలశానికి పూజించడం వరలక్ష్మి వ్రతంలో కీలకమైనది. ఈపూజను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వ హించడం వలన భర్తకు అత్తామామలకు, పిల్లలకు మంచి జరుగుతుందని అందరూ తెలియజేయడం గమనార్హం. పూజలో ఎరుపు జాకెట్లు,ఎరుపుగాజులు, అన్ని రకాలపళ్ళు, ప్రసాదాలు, బూరెలు, గారెలు, స్వీట్లు పెట్టడంతోపాటు వరలక్ష్మి దేవి వ్రత కథ విధానాన్ని తప్పనిసరిగా చదివి వినిపిస్తారు. ఎవరిస్థాయికి తగ్గరీతిలో అవకాశం ఉన్నవారు అమ్మవారికి కొత్తగా బంగారు వస్తువునుకూడా కొనుగోలుచేసి పూజలు చేస్తారు.